క్లుప్తంగా

అశ్వ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో జరిగిన నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజున శ్రీరంగనాథుడు అశ్వ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించి తరించారు.

రేపు వైద్య నిపుణుల రాక

పులివెందుల రూరల్: పట్టణంలోని స్థానిక భాకరాపురం దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ వైద్య చికిత్స చేస్తారని డా.ఈసీ.దినేష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఆయన అందుబాటులో ఉంటారని, మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్స చేస్తారని తెలిపారు. కర్నూలు విశ్వభారతి ఆస్పత్రికి చెందిన ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనినాయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పాలేటి గంగమ్మ ఆలయానికి యాత్ర

ముద్దనూరు: ప్రకాశం జిల్లా ఎర్రగడ్డ పాటి గంగమ్మ దేవాలయానికి మండల యాదల సంఘం సభ్యులు శుక్రవారం యాత్ర చేపట్టారు. స్థానిక శివాలయం నుంచి గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగింపుగా సాగనంపారు. సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ ఈ యాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, పుల్లయ్య, నారాయణ, ఈశ్వరయ్య, సత్యం, రామసుబ్బయ్య, సుధాకర్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు గుర్తింపు



క్రీడాకారులతో రవికుమార్, తదితరులు

– టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

వేంపల్లె: క్రీడల్లో విజయాలను సొంతం చేసుకున్నపుడు విద్యార్థులకు తగిన గుర్తింపు లభిస్తుందని టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాల వద్ద క్రీడాకారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నికాయట్ పోటీల్లో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, పీఈటీలు సుజాత, నారాయణస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యుడు భరత్‌కుమార్‌రెడ్డి

పెద్దముడియం: మండలంలోని ఉలవపల్లె గ్రామంలో ఏపీ పశువర్ధక శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యులు భరత్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి 35 పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 27 దూడలకు నట్టల నివారణ మందులు, 15 గేదెలు, 30 గొర్రెలు, మేకలకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిక్రిష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

పాఠశాల వాహనాలకు అనుమతి తప్పనిసరి

ఎర్రగుంట్ల: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తరలింపునకు వినియోగించే వాహనాలకు అనుమతులు తప్పనిసరి అని మండల విద్యాధికారి శివప్రసాద్ అన్నారు. స్థానిక జీవన జ్యోతి స్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లకు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదన్నారు.


చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ

వేముల: మండలంలోని పాఠశాలల్లో నిర్వహించే చెకుముకి పరీక్షల పోస్టర్లను జేవీవీ నాయకులు గంగాధరరెడ్డి, హెచ్‌ఎం నాగిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 25న జరిగే పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు.

మోటారు తీగల చోరీ

ముద్దనూరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని మూడు మోటార్ల తీగలను శుక్రవారం చోరీచేశారు. చెన్నారెడ్డిపల్లె, శివాలయం జగనన్న లేఅవుట్, వనంలోని మూడు మోటర్ల తీగలు దొంగలించారు. రాళ్లు వేయడంతో బోరు ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు.

అనుమతిని ఉపసంహరించుకోవడం తగదు



పులివెందుల వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతిని ఉపసంహరించుకోవడం అంగీకార యోగ్యం కాదు. యువతకు వైద్య విద్య అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపించకపోతే, ప్రజల ఆరోగ్యం, విద్యావకాశాలు తీవ్రంగా నష్టపోతావాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల, కడప జిల్లా పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణం. ప్రభుత్వం ఈ విషయంపై కచ్చితమైన చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ ప్రమాణాల పరంగా వైద్యవిద్యా ప్రాప్తి పునరుద్ధరణ కోసం నాణ్యమైన ప్రయత్నాలను చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రతీకార రాజకీయాలు వదలి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. – మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరం చేసే కుట్ర



ఆంధ్ర ప్రదేశ్‌లో వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. మెడికల్ సీట్లు ఇస్తామంటే.. తమకు వద్దంటూ లేఖ ఇవ్వడం దారుణం. పేద, మధ్యతరగతి విద్యార్థుల వైద్య విద్యకు మోకాలడ్డడం తగదు. ఏపీలో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 50 సీట్లను కేటాయించగా, తమ వల్ల కాదని చేతులెత్తేసి ఎన్‌ఎంసీకి లేఖ రాయడం సరి కాదు. పులివెందుల ప్రాంతంపై వివక్ష వదిలేసి అభివృద్ధికి సహకరించాలి. కూటమి ప్రభుత్వం వైద్యవిద్యనే కాకుండా గుజరాత్ తరహాలో పీపీపీ మోడల్ తరహాలో ప్రైవేట్ వ్యక్తులకు కొత్తవైద్య కళాశాలలను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. – శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి

చిన్నారుల వితరణ



డబ్బు వివరాలు చూపుతున్న చిన్నారులు

జమ్మలమడుగు: విజయవాడ వరద బాధితుల కోసం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూ.3300 సేకరించి ముఖ్యమంత్రి సహాయనిధికి ఫోన్‌పే చేశారు. పెద్దముడియం మండలం ఎస్.కొట్టాలకు చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తాము దాచుకున్న డబ్బును కష్టాల్లో ఉన్న వరద బాధితులకు సాయంగా ఇచ్చారు. ఈ డబ్బును ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు ఫోన్ పే ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి పంపించారు. పిల్లల దాతృత్వానికి గ్రామస్థులు అభినందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

కమలాపురం: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి జీవిత లక్ష్యాలను సాధించాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మదర్ థెరీసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మత్తులో ఉన్న యువకులు ఇతరులతో అసభ్యంగా ప్రవర్తించడం, చోరీలకు పాల్పడడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం నార్కోటిక్స్ చట్టాల విషయంలో కఠినంగా ఉందని, మాదక ద్రవ్యాలు విక్రయించే వారిపై అధికారులకు ప్రజలే సమాచారం ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డా. గుణ శేఖర్ మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే మత్తు మందుల వాడకం క్రమేణా అలవాటుగా మారుతుందని, తర్వాత డబ్బులు లేకపోతే ఇళ్లల్లో దొంగతనం చేసి కొనే స్థితికి చేరుకుంటారన్నారు. చాలామంది వాటికి అలవాటుపడి మానసిక క్షోభకు గురై డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకుంటారన్నారు. జూటూరు విజయ్‌కుమార్, కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి



హాజరైన విద్యార్థులు

అభిషేక్‌రెడ్డి అనారోగ్యంపై విష ప్రచారం తగదు

వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్.మదన్‌మోహన్‌రెడ్డి



వైఎస్.మదన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్: తన కుమారుడి అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని టీడీపీ విష ప్రచారం చేస్తోందని అభిషేక్‌రెడ్డి తండ్రి మదన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కించపరచడమే అజెండాగా కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. తన కుమారుడు అభిషేక్‌రెడ్డి తీవ్ర జ్వరం, ఇతర సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారని.. ఇపుడు క్రమంగా కోలుకుంటున్నారని ఆయన వెల్లడించారు. పార్టీకి పనిచేసిన అభిషేక్‌రెడ్డిని పట్టించుకోవడం లేదని సామాజిక మాధ్యమాల్లో రావడంపై ఆయన స్పందించారు. అభిషేక్‌రెడ్డి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి అతడికి అందుతున్న వైద్యంపై జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు డాక్టర్లతోనూ, తనతోనూ మాట్లాడుతూ ఆరా తీస్తున్నారన్నారు. టీడీపీలో విలువలు, నైతికత ఎక్కడా కనిపించడం లేదని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

15న ప్రవక్త జన్మదిన వేడుకలు



కమలాపురంలో వెలసిన దర్గా-ఈ-గఫారియా

కమలాపురం: దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన, ప్రభుత్వ ప్రొటోకాల్ కలిగిన దర్గా ఈ గఫారియాలో ఈ నెల 15న మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కమలాపురంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్గా ఈ గఫారియాలో ఏటా ఆసారే షరీఫ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 1400 ఏళ్ల క్రితం మహ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబ సభ్యులు వాడిన వందకు పైగా వస్తువులను ఇక్కడ ప్రదర్శిస్తారన్నారు. ఆ వస్తువులను మక్కా, మదీన, బాగ్దాద్, ఈజిప్ట్, టర్కీ దేశాల నుంచి తెప్పించినట్లు ఆయన వివరించారు. అదే రోజున రాత్రి భారీ ఎత్తున అన్నదానం, 16న జెండా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం మిలాద్‌నబీ ప్రత్యేక దువా జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నీట నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

జమ్మలమడుగు: ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ నాగరాజు కోరారు. మైలవరం మండలం వద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగం కాలనీని ఆయన పరిశీలించారు. కాలనీలో మురుగు, ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు చూసి దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, డెంగీతోపాటు చికున్‌గన్యా వ్యాధులు ప్రబలూ అవకాశం ఉందని, ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డాఎంహెచ్‌ఓ శాంతికళ, వైద్యాధికారులు హుస్సేన్‌బాషా, ప్రశాంత్‌కుమార్, రమేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాబు నీకు ఇది తగునా

జమ్మలమడుగు: కేంద్రం నుంచి నిధులు తెచ్చి వరద బాధితులను ఆదుకోవాలి కానీ.. డ్వాక్రా సంఘాల సభ్యుల వద్ద రూ. 500 వసూలు చేయడం తగునా.. చంద్రబాబూ అంటూ వైస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం బలవంతంగా విరాళాలు వసూలు చేయలేదన్నారు. 2019 తర్వాత దేశంలో కరోనా వచ్చినా.. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎవరి వద్ద విరాళాలు సేకరించలేదని, ప్రభుత్వం నుంచే ప్రజలకు ఆర్థిక సాయం చేయడంతోపాటు వైద్యాన్ని అందించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సెక్టార్లు, డ్వాక్రా సంఘాల నుంచి డబ్బులు వసూలు చేయడం సరైంది కాదన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

పెండ్లిమర్రి: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయాధికారి ఓబులేసు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువులు విక్రయించిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. బిల్లు బుక్‌లో తేడాలుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దముడియం: జంగాలపల్లెలో పత్తి ,మొక్కజొన్న, కొర్ర పంటలను జిల్లా వనరుల వ్యవసాయాధికారి శైలజ, కడప వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మహేశ్వరి శుక్రవారం పరిశీలించారు. పంటల సాగులో మెలకువను రైతులకు వివరించారు. గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరా పొలంలో ఐదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పురుగు ఎక్కువైనపుడు తయోడికార్బ్ గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఏవో అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

కొండాపురం: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో వీఆర్వో గడ్డం పుల్లన్న(46) గుండెపోటుతో మృతి చెందారు. పుల్లన్న మృతదేహాన్ని తహసీల్దారు మాదవ క్రిష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. మృతుడు పుల్లన్న సంకేపల్లె రెవెన్యూ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఇటీవల గుండెపోటు రావడంతో అనంతపురం ఆస్పత్రిలో స్టంట్ వేయించుకున్నారు. మళ్లీ గుండెపోటు రావడంతో మృతి చెందారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కుమారుల మానవత్వం.. తల్లి నేత్రాల దానం



బచ్చు సావిత్రమ్మ (ఫైల్)

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణం బుల్లా వీరప్ప వీధికి చెందిన బచ్చు సావిత్రమ్మ (93) గురువారం రాత్రి హైదరాబాద్‌లో అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుమారులు సుభాష్ చంద్రబోష్, సుధీర్, అల్లుడు సుదర్శన్, కుమార్తెలు సుశీలమ్మ, సువర్ణలు నేత్రదానానికి అంగీకరించారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధి సిబ్బంది కార్నియాసేకరించారు. రాజు మాట్లాడుతూ నేత్ర దానం చేసేందుకు వయసు పరిమితం కాదన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

కొండాపురం: కొండాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ భక్త వత్సలం శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక రామచంద్రా నగర్‌లో నివాసం ఉండే నారాయణమ్మను అదే కాలనీకి చెందిన ఈశ్వరమ్మ కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. ఈ కేసులో డీఎస్పీ క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వివరాలు ఆరా తీశారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మండల ఇన్‌ఛార్జి, నాయకులు

వేముల: వేముల మాజీ సర్పంచ్ చల్లా పెద్దవెంకటయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో ఎంపీపీ దంపతులు చల్లా గంగాదేవి, వెంకటనారాయణ అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ వెంకటబయపురెడ్డి, మాజీ పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి పాల్గొని ముందుగా మాజీ సర్పంచ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండి మాపీరా, సుబ్బారెడ్డి, నాగభూషణం, రాములయ్య, గంగాధర్, గంగులయ్య, ఎస్‌ఓ శారదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్బీఐ క్విజ్‌పై అవగాహన

వేంపల్లె: స్థానిక వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ నిర్వహిస్తున్న క్విజ్‌పై కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డా.యోగాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, సురేంద్రబాబు హాజరై విద్యార్థులకు క్విజ్ పోటీలకు రిజిస్ట్రేషన్ నమోదు గురించి వివరించారు. డా.మల్లేశ్వరమ్మ, డా.ఓబుల్ రెడ్డి, డా.నాగలక్ష్మీదేవి, వినోద్ కుమార్, శ్రావ్య పాల్గొన్నారు.

ఆరుగురు అరెస్టు

వేంపల్లె: స్థానిక పాపాఘ్ని నది సమీపంలో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ వెల్లడించారు. శుక్రవారం పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఆదేశాల మేరకు సీఐ సురేష్ రెడ్డి, ఎస్సై తిరుపాల్‌నాయక్, సిబ్బంది కలిసి జూదం ఆడుతున్న స్థావరంపై దాడులు చేశారు. వారి నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుళ్లు కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్య అనేది చట్ట వ్యతిరేకమైన చర్య



మాట్లాడుతున్నరిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్

వేంపల్లె: ఆత్మహత్య అనేది చట్ట వ్యతిరేకమైన చర్య అని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర పేర్కొన్నారు. ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో శుక్రవారం ఆత్మహత్య వ్యతిరేకత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న విషయాలను పెద్దగా భావించి పరిష్కరించలేని సమస్యలుగా ఊహించుకోరాదన్నారు. ఆత్మహత్య చేసుకొని తల్లిదండ్రులకు తీరని లోటు మిగుల్చుతారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏవీఎస్.కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మధుసూదన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు గోవర్ధన్, తిరుపతిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇందుమతి, సుబ్బరాయుడు, అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్..

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో కాపువీధిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో గురువారం సిఐ ఎస్. లింగప్ప, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సోమశేఖర్, ప్రసాద్ మరో ఐదుగురిని అదుపులోకి తీసుకోని వారి నుంచి రూ, 32,400 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె: ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. వేంపల్లె ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం బ్యాగులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఉర్దూ కళాశాలలో ల్యాబ్ పరికరాల కోసం కలెక్టర్ రూ.12 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని, కళాశాల రహదారిలో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఆర్జేడి రవి, ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య, జీవి.రమణ, కృష్ణారెడ్డి, నాగభూషణ, రహంతుల్లా ఖాన్, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో సైబర్ నేరాలపై అవగాహన



13జెఎండి54-మాట్లాడుతున్న ఆర్టీపీపీ సీఈ గౌరీపతి, బ్యాంక్ అధికారులు

ఎర్రగుంట్ల: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఆర్టీపీపీ సీఈ గౌరీపతి పేర్కొన్నారు. ఆర్టీపీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలతో కలిగే అనర్థాలపై ఆర్టీపీపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. సీఈ గౌరీపతి మాట్లాడుతూ సైబర్ నేరస్తులు ముందు ఆశ పెట్టి తర్వాత ఫేక్ లింక్‌లు పంపి డబ్బు లాక్కుంటారన్నారు. ఖాతాదారులు జాగ్రత్తలు పాటించాలని, ఫేక్ కాల్ వస్తే లింక్ ఓపెన్ చేయకూడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ ఎస్‌ఈలు ,ఈఈ, డీఈలు, తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలోని మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నపూస రమణారెడ్డి(57) గుండెపోటుకు గురై శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆయన మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి ఉన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత



మందు పిచికారీ చేయిస్తున్న డా.శాంతకుమార్

పులివెందుల రూరల్: దోమల నియంత్రణ అదరి బాధ్యత అని వైద్యాధికారి డా. శాంతకుమార్ తెలిపారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా పులివెందుల పట్టణంలోని భాకరాపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రశాంతినగర్, భాకరాపురం, జండమాన్ వీధిలో శుక్రవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. సైఫోనోత్రిన్ పిచికారీ చేసి, నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారీ చేశారు. అనంతరం శాంతకుమార్ మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గన్యా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని, దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న తొట్లు, ఇతర పాత్రలు మూసి ఉంచాలని, ఇంట్లో కొళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కల్పన, సోమేశ్వరి, సుబహాన్‌బీ, నాగమణి, సావిత్రి, హుసేన్, మాధవి, పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

సింహాద్రిపురం: లైంగిక వేధింపులపై మైనర్ బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ అన్నారు. కోరగుంటపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం ఆన్‌లైన్ మోసాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసం, లైంగిక దాడుల నివారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై ఆయన వివరించారు. కంప్యూటర్ కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యం పాటించాలి

–జేడీఏ అయితా నాగేశ్వర రావు

కమలాపురం: రైతులు సాగు చేసిన పంట పొలాల్లో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని టి.చదిపిరాళ్లలో సాగు చేసిన కంది, కొర్ర పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులతో పంటల సాగు, సస్య రక్షణ చర్యల గురించి ఆరా తీశారు. కంది పంటలో ఎకరానికి 20 పక్షి స్థావరాలు, 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ నమోదు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఈఓ దస్తగిరి, వీఏఏ మమత, రైతులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

జమ్మలమడుగు: సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి ప్రతాప్ అన్నారు. స్థానిక మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సమాజం నుంచి జాతీయ స్థాయిలో బలమైన నాయకుడిగా ముద్రవేసుకున్న నాయకుడు సీతారాం ఏచూరి అన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, యాకోబు, వినోద్, దాసు, రాజేష్, జయపాల్ పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు

నిత్యం ప్రజా సమస్యలతో పోరాటం చేస్తూ పేరు సాధించిన నాయకుడు సీతారాం ఏచూరి అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. స్థానిక పాత బస్టాండులో సీతారాం ఏచూరి కొవ్వొత్తులు చేతబట్టి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, తులసీశ్వర యాదవ్, జిలాన్, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుకు ఈ నెల 15 వరకు గడువు

లింగాల: ఖరీఫ్-2024లో మండలంలో సాగు చేసిన పంటల నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంటుందని, ఆలోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. వెలిదండ్ల రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి పంట నమోదును పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ పంట నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, నష్ట పరిహారం,రుణాలు అందుతాయని తెలిపారు.